క్లుప్తంగా

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సైబేజ్ కంపెనీ ఎప్పుడు ముందుంటుందని సీనియర్ సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ సురేష్ అన్నారు. శనివారం జగద్గిరినగర్ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్ తదితర వస్తువులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని, భవిష్యత్తు బాగుంటుందని, మంచి ఉద్యోగం సంపాదించుకోవచ్చని ఆయన అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపడతామని సురేష్ తెలిపారు.

19న నీటి సరఫరా బంద్

జగద్గిరిగుట్ట: గోదావరి తాగునీటి సరఫరాలో మెయిన్ పైప్‌లైన్‌కు ఏర్పడ్డ లీకేజీల మరమ్మత్తుల నేపథ్యంలో నగరంలో ఈ నెల 19వ తేదీన ఉదయం 6 గంటల నుండి 36 గంటల పాటు పలు ప్రాతంతాలలో నీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు జలమండలి అధికారులు తెలియజేసారు. దీనిలో బాగంగా డివిజన్ –12 కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, చింతల్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, గాసులరామారం సూరారంలలో నీటి సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

విరాళాలు సేకరించిన విద్యార్థులు



ఎన్‌ఎస్ఎస్ యూనిట్ సభ్యులతో బీవీఆర్ఐటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎన్ సునీత

నిజాంపేట్: బాచుపల్లి బీవీఆర్ఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం దాన్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు ఆహార, ఆటల దుకణాలు నిర్వహించిన డబ్బులను పోగు చేశారు. అదే విధంగా అధ్యాపకుల నుండి కిరాణా సామాగ్రి, బట్టలను సేకరించారు. వీరిని స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇవ్వనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎన్ సునీత తెలిపారు.

19న బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 19న జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు అమ్మవారికి గణపతి పూజ, అర్చన, అభిషేకం తదితర ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఈ వార్షికోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని చేయాలని నిర్వాహకులు తెలిపారు.

నేలకూలిన చెట్లను తొలగించండి



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు

దుండిగల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు నేలకొరుగుతున్న చెట్లను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి జ్యోతిరావు పూలే స్టేడియానికి వెళ్లే దారిలో ఉన్న రాగి చెట్లు కిందపడిపోయాయి.దీంతో అక్కడి నుంచి వచ్చే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు శివకుమార్

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన శివకుమార్ 3 నెలల క్రితం నగరానికి వలస వచ్చి అంగడిపేట్‌లో నివసిస్తూ స్థానికంగా ఓ భవన నిర్మాణంలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా మద్యం అలవాటు ఉన్న శివకుమార్ శనివారం ఉదయం 10గంటల సమయంలో తాను నివాసముంటున్న గది షెడ్డు రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల ఏర్పాట్లు పూర్తి

మూసాపేట: మూసాపేటలోని చిత్తారమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాస బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ తూము శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దర్శనానికి ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు.

బోనాల సందడి

సుభాష్‌నగర్: ఆదివారం బోనాల పండుగ పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ లోని పలు ఆలయాల వద్ద ఒకరోజు ముందుగానే పండగ వాతావరణం నెలకొంది. బోనాల పండుగ నిమిత్తం లైటింగ్, పుష్పాలతో ఆలయాలను ముస్తాబు చేశారు. షాపూర్ నగర్, జగద్గిరిగుట్ట, చింతల్, సుచిత్ర, సూరారం ప్రాంతాలలో రోడ్డుకిరువైపులా ఆకులు, పండ్లు, పూలు, కుండలు అమ్మడానికి పెట్టారు. బోనాల పండుగ కోసం చాలా చోట్ల నాటు కోళ్లు, మేకల మండేలు వెలిశాయి. ఒకరోజు ముందుగానే భక్తులు వీటిని కొనుగోలు చేశారు.



అపురూపా కాలనీ టీవీఆర్‌స్కూల్‌లో..



ప్రత్యేక అలంకరణలో చిత్తారమ్మ..



ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం..

పాఠశాలల్లో..

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఒకరోజు ముందుగానే బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు పోతరాజుల వేషధారణలో అలరించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారికి బోనాలు సమర్పించి సందడి చేశారు.



మగ్దూంనగర్ సాయివిద్యానికేతన్‌లో..



వెంకటేశ్వరనగర్ బచ్‌పన్ పాఠశాలలో జరిగిన ఉత్సవాల్లో పోతరాజుల వేషధారణలో చిన్నారులు..

నిజాంపేట్ అభివృద్ధికి కృషి



నిజాంపేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

కుత్బుల్లాపూర్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 26వ డివిజన్‌లో శనివారం ప్రగతియాత్రలో భాగంగా ఆయన మేయర్ నీలీఆరెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, కమిషనర్ రామకృష్ణారావులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బృందావన్ హిల్స్‌లో రూ. 80 లక్షలతో డ్రైనేజీ పనులు, సాయిబృందావన్‌లో సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో హరిశ్రీ ఎవెన్యూలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, మధుర నగర్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు రూ. 25 లోలతో సీసీ రోడ్డు పనులకు ప్రారంభోత్సవాలు, అదే విధంగా రూ. 25 లక్షలతో క్రీడా ప్రాంగణం, ప్రశాంతి హిల్స్ పార్కు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాఘవేంద్రరావు తదితరులు ఉన్నారు.

◆ జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్ నగర్‌కు బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్ తన అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్ తదితరులు ఉన్నారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి 14 వార్డులోని దుర్గాభవాని ఆలయ ప్రాంగణంలో దూలపల్లి మున్నూరు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే వివేకానంద్, స్థానిక చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్య, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బూరుగుబావి హనుమంత్ రావు, పాక్స్ చైర్మ నరేందర్ రాజు, మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, దూలపల్లి మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు బూరుగుబావి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ గరిసె సతీష్ తదితరులు ఉన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు



దూలపల్లి శ్రీరామాలయ కల్యాణ మండపానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. దూలపల్లిలోని శ్రీరామాలయంలో నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండప నిర్మాణ పనులకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అనంతరం ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ గరిసె నరేందర్ రాజు, కౌన్సిలర్ డప్పు కిరణ్, ఆలయ కమిటి చైర్మన్ బూర్గుబావి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గరిశ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్వాహకులకు చెక్కుల పంపిణీ

కుత్బుల్లాపూర్: ఆషాఢమాసం బోనాలు ఘనంగా జరుపుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. బోనాల పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 105 దేవాలయాలకు మంజూరైన రూ.26 లక్షల చెక్కులను శనివారం ఎమ్మెల్యే వివేకానంద్ చింతల్‌లోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో బోనాల పండగ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నామని అన్నారు.అంతే కాకుండా దేవాలయాల్లో ధూప దీప నైవేద్యం పథకం ద్వారా ప్రతి నెల రూ.10 వేలు అందజేస్తున్న ఏకై న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో పలు దేవాలయాల కమిటీ సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ టీమ్స్ రెడీ

జగద్గిరిగుట్ట: వానా కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను రెడీ చేసారు. జూన్ నుండి అక్టోబర్ వరకు సాగే ఈ ప్రోగ్రామ్‌లో కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించిన సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్, రంగారెడ్డినగర్, జీడిమెట్ల వార్డులలో మూడు షిఫ్టులకు మొత్తం 9 మంది లేబర్ల చొప్పన మరియు రంగారెడ్డినగర్, జీడిమెట్ల వార్డులలో 10 మంది లేబర్ల చొప్పన పనులు చేయడానికి సిద్ధమయ్యారు. అలాగే గాజులరామారం సర్కిల్‌కు సంబంధించిన చింతల్, సూరారం వార్డులకు మూడు షిఫ్టులకు మొత్తం 8మంది లేబర్లు ఉండగా, గాజులరామారం, జగద్గిరిగుట్ట వార్డులలో కూడా 8మంది లేబర్లతో టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు ఆయా ప్రాంతాలలో పర్యవేక్షిస్తూ ఈ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేల చర్యలు చేపట్టారు.

జన ఆరోగ్య సమితి కమిటీ సమావేశం

అల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ యుపిహెచ్‌సి వారు నూతనంగా ఏర్పాటు చేసిన జన ఆరోగ్య సమితి కమిటి మొదటి సమావేశం శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో జరిగింది. జన ఆరోగ్య సమితి కమిటీ చైర్‌పర్సన్, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటి సెక్రటరీ డాక్టర్ మను పప్పన్, జన ఆరోగ్య సమితి సభ్యులు, యూపిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జీహెచ్‌యంసి పరిధిలోని వైద్య, విద్య, శానిటేషన్, ఎంటమాలజి వంటి వివిధ శాఖలలోని అధికారులను ఎన్నుకొని జన ఆరోగ్య సమితి కమిటి ఏర్పాటు చేశామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బాలానగర్: ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి సందర్శించారు. శనివారం ఫతేనగర్ డివిజన్‌లోని శివశంకర్‌నగర్ కమ్యూనిటీ హాలులో ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల విజయవంతమైన సుపరిపాల సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అనేక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రేమ్‌కుమార్‌ను బీజేపీ పార్టీ తరపున అభినందిస్తున్నానని హరీష్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఆకుల ఉదయ్‌కుమార్, బానేష్, గోపాల్, నరేష్, ప్రమోద్, శ్రీనివాస్, చంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థులు



కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని పీయర్‌సన్ స్కూల్‌లో శనివారం 12వ ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అడిషనల్ కమిషనర్ ఎం .నవీన్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల స్పోర్ట్స్, హెల్త్, స్టూడెంట్స్ తదితర విభాగాలకు కెప్టెన్‌లుగా నియమితులై విద్యార్థులకు బ్యాడ్జిలను అందజేశారు. ఈ సందర్భంగా వారు నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. విద్యార్థుల్లో బాధ్యతలను పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ హైందవరెడ్డి, ప్రమోటర్ పెద్ది సీతారామ్‌రెడ్డి, ఉపాధాయులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి పరిశ్రమల దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు..

నిజాంపేట్: దేశాభివృద్ధిలో సూక్ష్మ, లఘు, చిన్న తరహా పరిశ్రమలో ఎంతగానో దోహద పడుతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఇండియా సదస్సుకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎక్కువగా ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఇండియా ద్వారా ఉపాధి పొందుతున్నారని దేశంలో 60 శాతం లఘు పరిశ్రమల వల్ల ఎగుమతులు జరుగుతున్నాయని, తెలంగాణలో ఎక్కువగా ఎగుమతి అయ్యే వస్తువులు లఘు పరిశ్రమల ద్వారా తయారైనవేనని, మహిళలు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ప్రమోషన్ కౌన్సిల్ ఇండియా తెలంగాణ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద మహిళలు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని. ఇందుకోసం అన్ని జిల్లాల్లోనూ ప్రచార కార్యక్రమాలను చేపట్టి అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ ప్రమోషన్ కౌన్సిల్ ఇండియా జాతీయ చైర్మన్ విజయ్ కుమార్ వైస్ చైర్మన్స్ పవన్ కుమార్ శర్మ , ప్రదీప్ మిశ్రా సర్కార్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



కుంకుమార్చనలో భక్తులు

జగద్గిరిగుట్ట: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పేట్ బషీరాబాద్ కట్ట మైసమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రారంభమైన ఈ పూజలు ఆదివారం ముగియనున్నాయి. శనివారం పూజలలో బాగంగా ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గం చెరువులో ఫైర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

మాదాపూర్: వరదల్లో, నీటిలో పడ్డవారిని ఏ విధంగా రక్షించాలో ఇండియన్ రెస్క్యూ అకాడమీ బృందం ఫైర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శనివారం మాదాపూర్‌లోని దుర్గం చెరువులో 65 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వాటర్ రెస్క్యూ ఆపరేషన్ టీం డెమోను నిర్వహించారు. వరదలు, ముంపులు వచ్చినప్పుడు బోట్‌లపై వెళ్ళి ఏ విధంగా కాపాడాలో అవగాహన కల్పించారు.

పవర్ ప్లాంట్‌ను వెంటనే మూసి వేయాలి



రాంకీ సంస్థ ముందు ఆందోళన చేస్తున్న తాండా వాసులు..

దుండిగల్: పవర్ ప్లాంట్ వల్ల తాము నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, వెంటనే ప్లాంట్‌ను మూసి వేయాలని తాండా వాసులు ఆందోళన చేపట్టారు. వివరాలు.. దుండిగల్ తాండా–2లో రాంకీ సంస్థ ఉంది. అందులో ఇటీవల నూతనంగా పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీంతో పవర్ ప్లాంట్‌ను నిరసిస్తు దుండిగల్ తాండా–2, గాగిల్లాపూర్ తాండా వాసులు శనివారం రాంకీ సంస్థ గేటు ముందు నిరసన తెలిపారు. పవర్ ప్లాంట్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాత్రి సమయాల్లో భారీ శబ్దాల కారణంగా నిద్రలేకుండా పోతుందని, అక్కడి నుంచి వెదజల్లే కాలుష్యం కారణంగా తీవ్ర దుర్వాసన వస్తుందని, స్థానిక మహిళలు, పిల్లలు, వృద్ధులు శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నారని, పవర్ ప్లాంట్‌ను మూసి వేసే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీంతో మరో నాలుగు రోజుల పాటు పవర్ ప్లాంట్‌లో ఎలాంటి పనులు చేయబోమని, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో తాండా వాసులు ఆందోళన విరమించారు.

ఇంకని గుంతలు..

● లోపించిన ఇంకుడు గుంతల నిర్వహణ.. ● కొన్ని శిథిలం.. మరి కొన్ని మాయం..

రంగారెడ్డినగర్: భూగర్భ జలాలను పరిరక్షిద్దాం.. వర్షపునీటిని ఒడిసిపట్టి భావి తరాలకు అందిద్దాం.. ఇది అధికారుల మాటలకే పరిమితమవుతోంది తప్ప చేతల్లో ఏమాత్రం కనబడటం లేదు.. వర్షపునీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను నీటి మట్టాని పెంచేందుకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు సరైన నిర్వహణ లేక ఇంకని గుంతలుగా మారుతున్నాయి. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీల రోడ్ల వెంబడి ఖాళీ ప్రదేశాల్లో లక్షలాది నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు నేడు రూపురేఖలు కోల్పోయాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏ ఒక్క ఇంకుడు గుంతల్లో వర్షపునీరు ఇంకే పరిస్థితి కనిపించడం లేదు.. జంట సర్కిళ్ల పరిధిలో ఇంకుడు గుంతలపై 'సాక్షి' ఫోకస్..

ఒక్కో ఇంకుడు గుంతకు రూ.30 వేలు..

బస్తీలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల నిర్వహణను ఆయా సంక్షేమ సంఘాలకు అప్పగించారు. అయితే వీటి నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇంకుడు గుంతల రూపురేఖలే మారిపోయాయి. కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని ప్రాంతాల్లో అసలు ఇక్కడ ఒకప్పుడు ఇంకుడు గుంత ఉందా అన్న చందంగా మారింది.. ఒక్కో ఇంకుడు గుంతకు 30 వేల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేయగా సరైన నిర్వహణ, వాటి పూడిక తీయకపోవడంతో మట్టితో నిండిపోయాయి. దీంతో పదుల సంఖ్యలో ఇంకుడు గుంతలు మాయమయ్యాయి..

ప్రభుత్వ కార్యాలయాల్లో అంతే సంగతి..

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ కార్యాలయాల్లోని ఇంకుడు గుంతల్లో పిచ్చి మొక్కలు మొలిచి నీరు ఇంకే పరిస్థితి లేకుండా పోయింది. ఇక కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయ ఆవరణలోని జీఎం భవనాన్ని ఆనుకుని ఉన్న ఇంకుడు గుంతలో గడ్డి మొలవడంతో పాటు సిబ్బంది తిని పారేసిన విస్తరాకులకు డంపింగ్ కేంద్రంలో మారింది. దీంతో కార్యాలయాల్లో ఇంకుడు గుంతల పరిస్థితి ఇలా ఉంటే ఇక కాలనీలు, బస్తీల్లో అవి ఏ స్థితిలో ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది..

పారిశ్రామికవాడల్లో ఇక అంతే..

జీడిమెట్ల, గాంధీనగర్ పారిశ్రామివాడల్లో ఇంకుడు గుంతలను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలో అయితే ఇంకుడు గుంతలు దాదాపు మాయమయ్యాయి. ఇలా అధికారులు పన్నుల వసూళ్ల చూపుతున్న శ్రద్ధ ఇంకుడు గుంతల విషయంలో చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలో ఇంకుడు గుంతలున్నా ఇసుక, మట్టితో పూడుకుపోయాయి..

శిథిలమై, చెత్త డంపింగ్ ప్రాంతాలుగా..

చాలా మటుకు ఇంకుడు గుంతలు శిథిలం కావడంతో ప్రస్తుతం వాటిలో స్థానికులు చెత్త చెదారాలు వేస్తున్నారు. దీంతో వేలాది రూపాయల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసి ఇంకుడు గుంత డంపింగ్ కేంద్రంగా మారింది. ఏపీహెచ్‌బీ కాలనీ, చెన్నారెడ్డినగర్, సూరారం టీఎస్ఐఐసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంకుడు గుంతల స్థానంలో చెత్త వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.

బహుళ అంతస్తుల భవనాల్లో కానరాని ఇంకుడు గుంత..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని బహుళ అంతస్తుల భవనాలు మొదలుకుని 500 గజాల స్థలంలో నిర్మాణాలకు తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఏ ఒక్క అపార్ట్‌మెంట్‌లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసిన ధాఖలాలు కనిపించవు, అధికారులు సైతం అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించిన సందర్భాలు సైతం కనిపించవు. కేవలం ప్రపంచ నీటి దినోత్సవం రోజునే భూగర్భ జలాలను పరిరక్షణ విషయం అధికారులకు గుర్తొస్తుంది. ఆ సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించిన ఆపై నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు.



జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలో పూడుకుపోయిన ఇంకుడు గుంత..



చెన్నారెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత వద్ద చెత్త డంపింగ్..



బాపూనగర్‌లో పూడుకుపోయిన ఇంకుడు గుంత



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని ఇంకుడు గుంత



జలమండలిలో ఇంకుడు గుంతలో పిచ్చి మొక్కలు.. విస్తరాకులు వేసిన దృశ్యం



ఏపీహెచ్‌బీ కాలనీలో శిథిలమైన ఇంకుడు గుంతలో పెరిగిన పిచ్చి మొక్కలు..